## 19న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

కృష్ణకాలనీ, డిసెంబర్ 16: ఈనెల 19న జయశంకర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూతల సమ్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 16 విభాగాల్లోని బాలబాలికలకు పరుగు పందెంలో 60, 80, 600, 1,600 మీటర్లు, లాంగ్‌జంప్, శాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, క్రీడల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 2024 జనవరిలో గుజరాత్‌లో జరిగే జాతీయ అంతర్ జిల్లాల క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. ఈనెల 19న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీల్లో అండర్– 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు, పురుషులకు, మహిళలకు పరగుపందెంలో 2, 4, 6, 8, 10 కిలోమీటర్ల చొప్పున ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 23న కామారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 19వ తేదీన జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో ఉదయం 8 గంటలకు తమ జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని తెలిపారు.



మహ్మద్ కిర్మాణిని అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

## టీఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కిర్మాణి

ములుగు రూరల్, డిసెంబర్ 16 : తెలంగాణ ఎంప్లాయీస్ అసోషియేషన్ (టీఈఏ) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ కిర్మాణిని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని నీటి పాదరుల శాఖ కార్యాలయ ఆవరణలో కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యాకూబ్‌పాషా మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. తమ సంఘంలో అటెండర్ నుంచి ఆఫీసర్ల వరకు అన్ని డిపార్టుమెంట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉంటారన్నారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలో ఆన్‌లైన్ మెంబర్ షిప్ కలిగిన సంఘం తమదేనని వివరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కిర్మాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలాలి మొగిలి, నేత కోటి, బాణాల ప్రభాకర్, కొత్తపల్లి మహేశ్, భూక్యా కృష్ణ, అజిమియా, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

## టీఎన్‌జీవో ఏటూరునాగారం యూనిట్ ఎన్నిక

ఏటూరునాగారం, డిసెంబర్ 16 : టీఎన్‌జీవో ఏటూరునాగారం యూనిట్ ఎన్నికలను శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పోల్‌రాజు ఆధ్వర్యంలో ఎన్నికలు చేపట్టగా యూనిట్ అధ్యక్షుడిగా ముసుకు అనిల్‌కుమార్, కార్యదర్శిగా బీ అశోక్, ఉపాధ్యక్షుడిగా మువీన్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రజిత, పబ్లిసిటీ సెక్రటరీగా భిక్షపతి, యూనిట్ సభ్యులుగా రియాజ్‌ఖాన్, భానుప్రకాశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, కోశాధికారి లాలునాయక్, ప్రదీప్, సురేశ్, రమాదేవి పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రామారావు

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మల్హర్, డిసెంబర్ 16 : మండలంలోని తాడిచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో దుబ్బపేట, ఎడ్లపల్లి, అన్‌సాన్‌పల్లి, నాచారం గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామరావు ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్లారం ఎంపీటీసీ అవిరినేని ప్రకాష్‌రావు, అన్ సాన్‌పల్లి సర్పంచ్ జగన్ నాయక్, ఎడ్లపల్లి ఉప సర్పంచ్ తోట రాజేశ్వరరావు, పీఏసీఎస్ డైరెక్టర్లు సుంకు రామన్న, బానోత్ సర్వనాయక్, నాయకులు జంగిడి శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- వ్యవసాయ రంగంలో పెరిగిన ట్రాక్టర్ల వినియోగం
- ట్రాక్టర్లు తిరగబడి తరచూ రైతులు, డ్రైవర్ల మృత్యువాత
- పొలం పనుల్లో 30శాతానికిపైగా వాహన ప్రమాదాలే..
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు

# అప్రమత్తత, అవగాహనతోనే ప్రమాదాల నివారణ

ట్రాక్టర్‌తో పొలంలో దమ్ము చేస్తున్న రైతు



పెద్దవంగర, డిసెంబర్16: వ్యవసాయంలో సాంకేతిక విప్లవం రావడంతో వాహన, యంత్ర వినియోగం కొనసాగుతున్నది. ఇందులో ట్రాక్టర్ వినియోగం సర్వసాధారణంగా మారింది. దుక్కి దున్నడం, గొర్రుతోలడం, వరినారు దాటించడం, విత్తనాలు, నాట్లు వేయడం, ఎరువులు, విత్తనాల బస్తాలు చేరవేయడం, పంట దిగుబడిని తరలించడం, వ్యవసాయ కూలీలను తీసుకురావడం తదితర పనులెన్నో ట్రాక్టర్ల ద్వారానే జరుగుతున్నాయి. పంట పొలాల్లో వ్యవసాయ పనులు చేస్తుండగా ట్రాక్టర్లు ప్రమాదాలకు గురై రైతులు, డ్రైవర్లు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. దీంతో వారి కుటుంబాల్లో తీరని విషాదం మిగులుతున్నది. అన్నం పెట్టే పంట భూముల్లో అర్థాయుషు దృష్యాలు హృదయ విధారకంగా కనిపిస్తున్నాయి.

### సీజన్ ప్రారంభం..

పంట పొలాల్లో ముఖ్యంగా వరి నాట్లు వేస్తున్న సమయంలో టాక్టర్లు పల్టీ కొట్టి ప్రమాదాలు జరుగుతున్నాయి. వానకాలం, యాసంగి పొలాల పనుల ప్రారంభ దశలో ట్రాక్టర్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలోనే ట్రాక్టర్లు బోల్తా కొట్టడం, పొలాల మధ్య ఉన్న చిన్న చిన్న దారులు, కల్లాల్లో ట్రాలీ అన్‌లోడింగ్ సమయంలో పైన ఉండే విద్యుత్ వైర్లు తాకడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాహనాల వినియోగంలో నేర్పుగా ఉండడం, ఇతర జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం యాసంగి పనులు ప్రారంభమై పొలం పనుల్లో ట్రాక్టర్ల వినియోగం మొదలైనందున రైతులు, డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

### పాటించాల్సిన జాగ్రత్తలు

- సరైన జాగ్రత్తలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.
- సాంకేతికంగా కూడా అవగాహన కలిగి ఉండాలి.
- ట్రాక్టర్ స్థిరత్వం కోసం ముందు ఇరుసు సుమారు 30–40శాతం బరువుతో, వెనుక ఇరుసు సుమారు 60–80శాతం బరువుతో ఉంటుంది. వెనుక చక్రాలు దిగబడినప్పుడు, ఒడ్లు ఎక్కించే సమయంలో పికప్ ఒత్తిడితో ముందు భాగం లేచి ట్రాక్టర్ పక్కకు తిరిగిపోవడం, లేదా బోర్ల పడడం జరుగుతుంది. ట్రాక్టరు వెనుక తగిలించే పనిముట్లు తక్కువ ఎత్తులో తగిలించి ఉంటే ముందు భాగం పైకి లేచినప్పుడు వెనుక భాగం వాలిపోకుండా ఆ పనిముట్టు భూమిని(నేల) తాకి కొంత వరకు నియంత్రించగలుగుతుంది.

### ట్రాక్టర్ ప్రమాదాలే ఎక్కువ..

పొలాలు, కల్లాల వద్ద సంభవిస్తున్న ప్రమాదాలపై జరిగిన పలు అధ్యయనాల ప్రకారం.. 30 శాతానికిపైగా ప్రమాదాలు ట్రాక్టర్లతోనే. 4శాతం మందు పిచికారీ, 6 శాతం పవర్ టిల్లర్లు, 9శాతం చాప్ కట్టర్లు, 12శాతం మోటర్లు, పంపుసెట్లు, 14శాతం నూర్పిడి మిషన్లు, 22శాతం జంతువుల సాయంతో నడిపే లేదా ఉపయోగించే వ్యవసాయ పరికాల ద్వారా జరుగుతున్నాయని తేలింది. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్ల ద్వారా జరిగే ప్రమాదాలను కలుపుకొంటే 37శాతం ప్రమాదాలు ట్రాక్టర్ల ద్వారానే జరుగతున్నాయని పేర్కొంటున్నారు.

### ప్రమాదాలకు కారణాలు

- దుక్కి దున్నేటప్పుడు, పొలం దమ్ము చేసే సమయంలో మడిలో లోతు అంచనా రాకపోవడంతో చక్రాలు దిగబడి బోల్తా కొట్టడం.
- ఒడ్లు(పొలం గట్లు) ఎక్కించేప్పుడు, దాటించేప్పుడు ఎత్తు, ఒడ్డు మట్టి గట్టిగా ఉందా? వదులుగా ఉందా? అంచనా తెలియక పోవడం.
- పాత బావులు, కాల్వలు, ఏండ్ల కొద్ది ఉన్న నీటి మడుగుల స్థానంలో పొలాలు చేసిన భూముల్లో మట్టి ఊబి లాగా దిగబడేలా మారడం.
- డ్రైవింగ్ సీటు సౌకర్యవంతంగా లేకపోవడం, డ్రైవర్ దుస్తులు, రుమాలు కేజ్ వీల్ , ఇంజిన్ భాగాల్లో ఇరుక్కుపోవడం.
- మద్యం తాగి, ఆనారోగ్య స్థితిలో ఉన్నప్పుడు నడపడం, త్వరత్వరగా పని పూర్తి చేయాలనే ఒత్తిడికి గురై నడపడం
- ధాన్యం, వస్తువులను అన్‌లోడ్ చేసేందుకు ట్రాక్టరు ట్రాలీని పైకి ఎత్తినప్పుడు విద్యుత్ వైర్లు తగలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



పొలంలో బోల్తాపడిన ట్రాక్టర్ (ఫైల్)

## పోలీసు కమిషనరేట్ మహిళా ఉద్యోగికి వేధింపులు

సుబేదారి, డిసెంబర్ 16 : ఉద్యోగ కోచింగ్ సమయంలో స్నేహం పేరుతో యువతిని పరిచయం చేసుకున్న యువకుడు తన వక్రబుద్ధిని చాటుకున్నాడు. అప్పులు ఉన్నాయని రూ.7లక్షల తీసుకొని, తిరిగి డబ్బులు ఇవ్వకుండా, తనను పెళ్లి చేసుకోవాలని యువతిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. అతడి బాధలు భరించలేక బాధిత యువతి పోలీసు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్లితే.. గీసుగొండ మండలానికి చెందిన ఓ యువతి 2018లో హైదరాబాద్‌లో గ్రూప్ కోచింగ్ తీసుకుంటున్న సమయంలో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన చంద్రశేఖర్ పరిచయమయ్యాడు. యువతికి గ్రూప్–4 ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పనిచేస్తుంది. ఈ క్రమంలో 2022లో అప్పులున్నాయని, తనకు ఉద్యోగం వచ్చిన తర్వాత తిరిగి ఇస్తానని చెప్పి, బాధిత యువతి నుంచి పలు దఫాలుగా రూ.7లక్షలు తీసుకున్నాడు. అలాగే, మెడలో ఉన్న బంగారు ఆభరణాలు కూడా తీసుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత ప్రేమిస్తున్నాను.. తనను పెళ్లి చేసుకోకపోతే చంపేస్తానని బెదిరించడమే కాకుండా అతడి దగ్గరి బంధువు ఆర్‌ఎస్సైతో బెదిరింపులు ప్రారంభించాడు. తనకు న్యాయం చేయాలని బాధితురాలు సీపీకి ఫిర్యాదు చేయడంతో, ఆయన ఆదేశాల మేరకు గీసుగొండ పోలీసు స్టేషన్‌లో ఈనెల 13న చంద్రశేఖర్‌పై కేసు నమోదైంది. అయితే చంద్రశేఖర్‌కు సహకరించిన ఆర్‌ఎస్సై శ్రీనివాస్‌పై కూడా బాధితురాలు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం విమర్శలు తావిస్తుంది. తనకు చంద్రశేఖర్ నుంచి రక్షణ కల్పించి, న్యాయం చేయాలని అధికారులను బాధితురాలు వేడుకుంటోంది.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

వెంకటాపురం (నూగూరు), డిసెంబర్ 16 : వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నంబర్ ప్లేట్‌లేని 15 ద్విచక్ర వాహనదారులపై కేసు నమోదు చేసి కౌన్సెలింగ్ ని ర్వహించారు. వాహనదారులు తప్పని సరిగా వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకొని నంబర్ ప్లేట్లు అమర్చుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండని పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.



అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న బాధితులు

## అర్హులకే డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలి

కృష్ణకాలనీ, డిసెంబర్ 16 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్ గడ్డలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన వారికే కేటాయించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బాధితులు సుమారు 2 గంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ మళ్లీ సర్వే చేసి, ఇండ్లులేని నిరుపేదలను గుర్తించి, వారికి ఇళ్లు ఇవ్వాలని కోరారు. తాము అర్హులమైనప్పటికీ ఇండ్లు రాలేదని, ఇప్పటికైనా తమను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ధర్నా విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్ అక్కడకు చేరుకొని మళ్లీ సర్వే చేసి, అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సుమారు 100 మంది బాధితులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చిట్యాల, డిసెంబర్ 16 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని చిట్యాల ఎస్సై–2 ఎండీ షాఖాన్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేసి, వాహనదారులు, పాదచారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ధ్రువపత్రాలు లేకుండా డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.